క్లుప్తంగా

డయాలసిస్ రోగికి పింఛను పంపిణీ



గోపాలయ్య పింఛను అందజేస్తున్న నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు గ్రామ దళితవాడకు చెందిన కే.గోపాలయ్య మూత్రపిండాల డయాలసిస్ కోసం రూ.10 వేల పింఛన్ మంజూరు కావడంతో సోమవారం సింగిల్‌విండో చైర్మన్ హరనాథరెడ్డి, సురుటుపల్లె దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యులు అజయ్‌కుమార్‌రెడ్డి నగదును అందజేశారు. అతను శ్రీకాళహస్తిలోని ఏరియా ఆసుపత్రిలో వారంలో రెండు రోజులు డయాలసిస్ చేసుకుంటున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జనార్ధన్, వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య, మాజీ సర్పంచ్ విజయభాస్కర్, వెంకటాద్రి, ప్రసాద్, వలంటీర్ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



విరాళం ఇస్తున్న తెలంగాణ భక్తులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాకు చెందిన జి.మోహన్‌రావు, రమణ కుటుంబ సభ్యులు సోమవారం రూ.35,500 విరాళాన్ని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులుకు అందజేశారు. దాతలకు స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు.

ఏడీఏలకు సన్మానం



ఏడీఏలను సన్మానిస్తున్న సిబ్బంది, డీలర్లు

సత్యవేడు: సత్యవేడు నుంచి శ్రీకాళహస్తికి బదిలీపై వెళుతున్న ఏడీఏ రమేష్ రెడ్డికి, తిరుపతి నుంచి సత్యవేడుకు వచ్చిన ఏడీఏ జే.సుబ్రమణ్యంలను వ్యవసాయ సిబ్బంది, డీలర్లు, సచివాలయ సిబ్బంది సోమవారం వ్యవసాయ కార్యాలయంలో సన్మానించారు. మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు కే. శ్యాంప్రసాద్ రెడ్డి మాట్లాడారు. ఏఓలు మురళి, సంజీవరెడ్డి, సుబ్బారావు, సుధాకర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ హిమబిందు, జూనియర్ అసిస్టెంట్ బొప్పన లలిత్‌కుమార్, డీలర్లు రమేష్, వీఏఏలు, ఎంపీహెచ్‌ఈఓలు, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

ఆర్వో ప్లాంట్ల పరిశీలన



వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న అంజూరు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తులకు శుద్ధ జలాన్ని అందించడమే లక్ష్యమని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఆయన ఆలయంలో దివీస్ లేబరేటరీస్ ఆధ్వర్యంలో ఐదు ప్రాంతాల్లో నిర్మిస్తున్న ఆర్వో ప్లాంట్లను పరిశీలించారు. మరో వారంలో పనులు పూర్తి చేసి భక్తులకు శివయ్య జలప్రసాదం అందిస్తామన్నారు. మరో ఐదు చోట్ల ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు మరో దాత ముందుకు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్లకు అవగాహన



మాట్లాడుతున్న సీడీపీఓ దేవకుమారి

సత్యవేడు: అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ, పోషకట్రాకర్లను సమగ్రంగా నమోదు చేయాలని సీడీపీఓ దేవకుమారి కోరారు. సోమవారం ఐసీడీఎస్ కార్యాలయంలో బ్లాక్ ప్రాజెక్టు అసిస్టెంట్ ఆఫీసర్ బి. శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గర్భవతులు, బాలింతలు, శిశువులకు ప్రభుత్వం ఇస్తున్న పౌష్టికాహారం, బాలామృతం, గుడ్లు, పాలు, కేంద్రం పరిధిలోని పిల్లలు, గర్భవతులు, బాలింతలు, కిశోరబాలికల వివరాలు సమగ్రంగా నమోదు చేయాలన్నారు. వివిధ అంశాలు సెల్‌ఫోన్‌లో ఎలా నమోదు చేయాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శ్రీదేవి, జ్యోతి, యమున, చెంచులక్ష్మి, శిల్ప తదితరులు పాల్గొన్నారు.

కరెంటు షాక్‌తో ఆవు మృతి

శ్రీకాళహస్తి: కరెంటు షాక్‌కు గురై ఆవు మృతి చెందిన సంఘటన మండలంలోని చల్లపాళెంలో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన వెంకటసుబ్బమ్మ రూ.70 విలువ గల పాడి ఆవు పోషణపై ఆధారపడి జీవిస్తోంది. సోమవారం మేత కోసం ఆవును పొలానికి తీసుకెళ్లింది. విద్యుత్ తీగలు పొలంలో తెగిపడి ఉండడంతో ఆవుకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. జీవనాధారం కోల్పోయిన తనకు అధికారులు తనకు న్యాయం చేయాలని బాధితురాలు విజ్ఞప్తి చేసింది.

నాడు దండగ..నేడు పండుగ



మండలంలో వరి, వేరుశనగ పంటల సాగు



ఆర్బీకేలలో రైతులకు పంపిణీ చేస్తున్న ఎరువులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో రైతే రాజుగా బతుకుతున్నాడు. గత టీడీపీ ప్రభుత్వం వ్యవసాయం దండగ అని రైతాంగానికి అన్ని విధాలా మొండి చేయి చూపింది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే రైతాంగ సంక్షేమానికి పెద్దపీట వేసింది. రైతు భరోసా కేంద్రాల ఏర్పాటుతో రైతుల కష్టాలకు తెరదించింది. వారి ముంగిటకే విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు మొదలుకుని పలు సేవలు అందుబాటులోకి తెచ్చింది. వ్యవసాయాన్ని పండుగ చేసింది.



నూతనంగా నిర్మించిన ఆర్బీకేలు

- టీడీపీ పాలనలో వ్యవ'సాయం' నిల్!
- వైఎస్సార్ సీపీ పాలనలో ఆర్బీకేలతో రైతాంగానికి విస్తృత సేవలు
- రాయితీతో ట్రాక్టర్లు, విత్తనాలు, ఎరువులు
- ఈ–క్రాప్ బుకింగ్‌తో పంట నష్ట పరిహారం
- వ్యయప్రయాసాలు తప్పాయంటున్న రైతన్నలు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి) : తొట్టంబేడు మండలంలోని 27 పంచాయతీలున్నాయి. మొత్తం 16 రైతు భరోసా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసి సేవలను అందిస్తోంది. చోడవరం, కొత్తకండ్రిగ, పూడి, చిన్నసింగమాల, పెద్దకన్నలి, తంగేళ్లపాళెం, కాసారం, బోనుపల్లె, చియ్యవరం, బసవయ్యపాళెం, శివనాథపాళెం, ఇలగనూరు, లింగమనాయుడుపల్లె, పెద్దకనపర్తి, తొట్టంబేడు–1,తొట్టంబేడు–2 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. 2021–22లో 6 రైతు భరోసా కేంద్రాలలో వైఎస్సార్ యంత్రసేవా కేంద్రాలు, మిగిలిన ఆర్బీకేలలో 2022–23లో 10 యంత్రసేవా కేంద్రాలు ఏర్పాటు చేశారు.

16 ఆర్బీకేలలో పంపిణీ చేసినవి

ఎరువులు	:	890 మెట్రిక్ టన్నులు
పురుగుమందులు	:	120 లీటర్లు
వేరుశనగ విత్తనాలు	:	100 క్వింటాళ్లు
వైఎస్సార్ యంత్రసేవా పథకం ట్రాక్టర్లు	:	15
రైతు భరోసాతో రైతులు పొందిన లబ్ధి	:	రూ.5.22 కోట్లు
మొత్తం రైతులు	:	6,956
ఏర్పాటైన కస్టమ్ హైరింగ్ గ్రూపులు	:	17
ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఎరువులు	:	210 మెట్రిక్ టన్నులు
జనుము విత్తనాలు	:	80 క్వింటాళ్లు
జీలుగ విత్తనాలు	:	400 క్వింటాళ్లు
పిల్లి పెసర విత్తనాలు	:	120 క్వింటాళ్లు

ప్రభుత్వం మాకెంతో మేలు



నాకు మూడెకరాల పొలం ఉంది. మా ఊరు నుంచి శ్రీకాళహస్తి 14 కిలోమీటర్లు ఉంది. తెలుగుదేశం ప్రభుత్వం ఉన్నప్పుడు పొద్దున సద్ది మూట తెచ్చుకుని శ్రీకాళహస్తికి వచ్చేవాళ్లం. ఎరువులు, పురుగు మందులు కోసం అధికారుల చుట్టూ తిరిగేవాళ్లం. ఇప్పుడా పరిస్థితి లేదు. ఏది కావాలన్నా మా ఊరిలోనే అందేలా జగనన్న ప్రభుత్వం ఆర్బీకేలతో ఏర్పాటు చేసింది. మాకెంతో మేలు చేసింది.

-వై.శివయ్య, చియ్యవరం

రైతు భరోసా కేంద్రాలతో ఉపయోగం



గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడంతో టౌను వెళ్లవలసిన బాధ తప్పింది. అప్పట్లో ఎరువుల కోసం తహశీల్దార్, ఆర్ఐలు చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఆటో చార్జీలు, టైం అంతా వేస్టయ్యేది. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. ఊరిలోనే విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు అన్నీ దొరుకుతున్నాయి. జగనన్న ప్రభుత్వంలో మాకు అన్ని పనులు మంచిగా జరుగుతున్నాయి.

-ఎస్.వెంకటప్రసాద్, చిన్నసింగమాల

లాభసాటిగా వ్యవసాయం



గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పొలం పని ముట్లు, ట్రాక్టర్లు కావాలంటే నాయకుల సిఫార్సు తప్పనిసరి. ఇప్పుడా బాధల్లేవ్. ఇప్పటి ప్రభుత్వం రైతుల గ్రూ పులను ఏర్పాటు చేసి ఆ గ్రూపులకు వ్యవసాయ పనిముట్లు ఇస్తోంది. రైతు భరోసాతో వ్యవసా యానికి పెట్టుబడి సాయం అందిస్తోంది. మాది పెద్దకన్నలి శ్రీ వెంకటేశ్వర రైతుమిత్ర గ్రూపు. మా గ్రూపు ద్వారా ట్రాక్టర్, పట్లర్లు తీసుకున్నాం. వాటితో వ్యవసాయం లాభసాటిగా చేసుకుంటున్నాం.

-కె.వెంకట రాఘవరెడ్డి, పెద్దకన్నలి

బయోమెట్రిక్‌తో అన్నీ అందుబాటులోకి



రైతులకు బయోమెట్రిక్‌తో అన్నీ ఇస్తున్నాం. సచివాలయాలలో అగ్రికల్చరల్ అసిసెంట్లు నియామకంతో ప్రభుత్వం రైతులకు ఎంతో మేలు చేస్తోంది. అన్ని ఆర్బీకేలలో ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు అందుబాటులో ఉన్నాయి. అలాగే రైతులకు సేంద్రియ వ్యవసాయంపై కూడా ఆర్బీకేలలో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నాం. రైతులు ఇప్పుడు వ్యవసాయం

-నాగోలు సురేంద్రరెడ్డి, మండల వ్యవసాయాధికారి, తొట్టంబేడు

బీజేపీ సభ జయప్రదం చేయండి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో ఈ నెల 10న నిర్వహించనున్న బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా భారీ బహిరంగసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్ పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి కోలా ఆనంద్‌తో కలిసి బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లు, సభాస్థలిని పరిశీలించారు. అనంతరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సభ నిర్వహణ ఇన్‌చార్జి విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, నాయకులు మేళాగరం సుబ్రహ్మణ్యంరెడ్డి, సామంచి శ్రీనివాసులు, వరప్రసాద్, సురేష్‌కునాటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

విరివిగా మొక్కలు నాటాలి



కూలీలతో మాట్లాడుతున్న పీడీ శ్రీనివాసప్రసాద్

ఏర్పేడు: ఉపాధి హామీ పథకం కింద ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతుల భూముల్లో విరివిగా మొక్కలు నాటాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని ఇసుకతాగేలిలో చేస్తున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. గ్రామాల్లో రైతులకు ఉపయోగపడే పంట, వరవ కాలువల మరమ్మతులు చేయాలని సూచించారు. అలాగే పండ్ల తోటల పెంపకం వైపు రైతులు మొగ్గు చూపేలా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఉపాధి హామీ పనుల్లో రోజుకు రూ.272 వేతనం వచ్చేలా విధంగా కొలతలు ఇవ్వాలన్నారు. ప్రతి పంచాయతీలో రోజుకు వంద మంది కూలీలు పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ దేవరి, ఈసీ బాలాజీరావు, సాంకేతిక, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ పునరుద్ధరణ జాప్యం..వరి పంటకు నష్టం

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): తొట్టంబేడు మండలం పూడి పంచాయతీ జూగుంటలోని గిరిజన కాలనీకి చెందిన రైతు సింహంశెట్టి వెంకటయ్య పొలంలో గత వారం గాలీవాన ధాటికి విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో వ్యవసాయ కరెంటు సరఫరా నిలిచిపోయింది. అప్పటి నుంచి ట్రాన్స్‌కో అధికారులను కోరుతున్నా కరెంటు స్తంభాలు, విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోకపోవడంతో తన మూడెకరాల వరి పొలానికి నీరందించే పరిస్థితి లేక పూర్తిగా ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విద్యుత్తు లైన్ల కింద మూడు సర్వీస్‌లు ఉన్నాయని, ఇకనైనా విద్యుత్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవడంతో పాటు పంట నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశాడు.



నీరు లేకపోవడంతో ఎండిన వరి పైరు

ఈఓపీఆర్డీకి వీడ్కోలు సన్మానం



బదిలీపై వెళ్తున్న విజయకుమారిని సత్కరిస్తున్న సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సత్యవేడు : నిస్వార్థంగా, బాధ్యతాయుతంగా పనిచేసే అధికారులు, ఉద్యోగులకు ప్రజల్లో మంచి గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. ఎంపీడీఓగా ఉద్యోగోన్నతి పొంది బదిలీ వెళ్తున్న ఈఓపీఆర్డీ విజయకుమారికి సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమెను ఘనంగా సత్కరించి సేవలను పలువురు ప్రస్తుతించారు. విజయకుమారి ఈఓపీఆర్డీగా బీఎన్‌కండ్రిగ, సత్యవేడు, వరదయ్యపాళెంలో నిస్వార్థంగా విధులు నిర్వర్తించి మంచి పేరు తెచ్చుకున్నారన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటు పడదాం

-సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

వరదయ్యపాళెం: కాలుష్యరహిత సమాజాన్ని నెలకొల్పేందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమవంతు పాత్ర పోషించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో ఆయన మొక్కలు నాటి మాట్లాడారు. అంతేకాక పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకత గురించి గ్రామాల్లో అటవీశాఖ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు, జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్ రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ నాయుడు దయాకర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, దేవాగం కార్పొరేషన్ డైరెక్టర్ తిలక్‌బాబు, ఎస్సీ సెల్ కన్వీనర్ బందిల సురేష్, కరుణాకర్ నాయుడు, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబ్దుల్, దుద్దు వేణు, నరేంద్ర, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తిలో..

శ్రీకాళహస్తి: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీనియర్ సివిల్ జడ్జి బేబీరాణి అన్నారు. శ్రీకాళహస్తి న్యాయస్థాన భవనం ప్రాంగణంలో ఆమె మొక్కలు నాటి మాట్లాడారు. కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆమె ఆదేశాల మేరకు బాల కార్మికుల నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా రైల్వేస్టేషన్‌లో న్యాయవాది మీర్జావలి, పారా లీగల్ వలంటీర్లు అవగాహన కల్పించారు.



వరదయ్యపాళెం : మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే

పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ

శ్రీకాళహస్తి: పర్యావరణ పరిరక్షణపైనే మానవాళి మనుగడ ఆధారపడి ఉందని అటవీ క్షేత్రాధికారి పి.లోకేష్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఎస్వీపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటి ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉప అటవీ క్షేత్రాధికారి రామకృష్ణ, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.మురళి, అధ్యాపకులు నరసింహాశర్మ, డాక్టర్ ఆర్.చంద్రమౌళి, ఓపీ ప్రసాద్, ఎం.తులసి, పరంధామయ్య, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు. అలాగే స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో పట్టణంలోని బాబు అగ్రహారం పురపాలక సంఘ పాఠశాలలో మొక్కలు నాటారు. స్కౌట్ మాస్టర్ అజారుద్దీన్, ఉపాధ్యాయురాలు పార్వతి, స్కౌట్ విద్యార్థులు పాల్గొన్నారు. ఇక శ్రీకాళహస్తి మండలంలో యువ సమాజ్ నిర్మాణ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పలుచోట్ల మొక్కలను నాటారు. రాష్ట్ర అధ్యక్షుడు తాళిక్కల్ వెంకటేశ్వర్లు, వ్యవస్థాపకులు డాక్టర్ గానుగపెంట రమేష్, సభ్యులు మునీంద్ర తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాళహస్తి : మొక్క నాటుతున్న న్యాయమూర్తి

అమరరాజ కర్మాగారంలో..

రేణిగుంట: పర్యావరణాన్ని పరిరక్షించి భావితరాలకు కాలుష్య రహిత సమాజాన్ని అందించడం మనందరి సమష్టి బాధ్యత అని అమరరాజ బ్యాటరీస్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నరసింహులునాయుడు అన్నారు.సోమవారం కరకంబాడి అమరరాజ కర్మాగారంలో 250 మొక్కలు నాటారు. పర్యావరణాన్ని పరిరక్షించడం కోసం కాలుష్య కారకమైన చర్యలకు దూరంగా ఉండాలని కోరారు.

ఏర్పేడులో..

ఏర్పేడు: మండలంలోని ఎస్ఓఎస్ బాలల గ్రామం ఆధ్వర్యంలో ఏర్పేడులో ర్యాలీ చేశారు. సేవ్ ఆక్సిజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాపానాయుడుపేటలో మొక్కలు పంపిణీ చేశారు. యువనేస్తం అసోసియేషన్ సంస్థ ఆధ్వర్యంలో రాజులపాలెం ఎస్టీ కాలనీలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రజా ప్రగతి ట్రస్ట్ మండల కన్వీనర్ చంద్రశేఖర్, సేవ్ ఆక్సిజన్ ప్రతినిధి కేశవులు, యువనేస్తం అసోసి యేషన్ వ్యవస్థాపకుడు మునిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాళహస్తి : మొక్కలను నాటుతున్న స్కౌట్ విద్యార్థులు



శ్రీకాళహస్తి : ఎస్వీపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..



రేణిగుంట: అమర రాజ కర్మాగారంలో..



పాపానాయుడుపేటలో ...

నేడు గడప గడపకు..

వరదయ్యపాళెం: వరదయ్యపాళెం మేజర్ పంచాయతీలోని సచివాలయం–1, 2 పరిధిలో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఉదయం 8గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తారని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి తెలిపారు. బీజీ ఆర్‌కాలనీ, అనిల్ గిరిజనకాలనీ, గోవర్ధనపురం గ్రామాల్లో ఆయన పర్యటిస్తారని చెప్పారు.

వేడుకగా గెరిగ ఉత్సవం



బజారు వీధిలో గెరిగ ఉత్సవం

పిచ్చాటూరు: పిచ్చాటూరులో నిర్వహిస్తున్న గంగ జాతరలో భాగంగా సోమవారం గెరిగ ఉత్సవం నిర్వహించారు. ప్రజలు గెరిగకు పసుపు నీళ్ల, కర్పూర హారతులు సమర్పించి నీరాజనాలు పలికారు.

108లో ప్రసవం



పిచ్చాటూరు: 108లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో గర్భిణి ప్రసవించిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు..నాగలాపురం మండలం కడివేడుకు నవనీతకు పురిటి నొప్పులు రావడంతో 108లో తొలుత సత్యవేడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు ఆమెను తరలించారు. అయితే సత్యవేడు ఆసుపత్రి వైద్యులు శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ క్రమంలో అదే 108లో నవనీతను శ్రీకాళహస్తి తరలిస్తుండగా మార్గమధ్యంలో పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో 108 సిబ్బంది ఆమెకు సుఖప్రసవం చేశారు. నవనీత మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం శ్రీ కాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నట్లు నవనీత బంధువులు చెప్పారు.


సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న ఎంపీపీ గీత

ఏర్పేడు: గ్రామాల్లోని సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎంపీపీ గీత అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. శాఖల పరంగా చేస్తున్న అభివృద్ధి పనులను ఆయా శాఖల అధికారులు వెల్లడించారు. సమావేశంలో జెడ్పీటీసీ తిరుమలయ్య, వైస్ ఎంపీపీలు శ్రీనివాసులు, జనార్ధన్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, ఎంపీడీఓ గిడ్డయ్య, వివిధ శాఖల అధికారులు, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

భూసమస్యల వినతులను పరిష్కరించాలి



మాట్లాడుతున్న తహసీల్దారు హనుమాన్‌నాయక్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో భూసమస్యలపై స్పందన కార్యక్రమంలో ఇచ్చే వినతులను పరిష్కరించాలని తహసీల్దారు హనుమాన్‌నాయక్ ఆదేశించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను గుర్తించి, వాటిని పరిష్కరించాలని, ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. భూమి లేని పేదలను గుర్తించి, అర్హులైన వారికి భూ పంపిణీ చేయడానికి చర్యలు తీసుకోవాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో డీటీ శివయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో అగ్నిగుండ ప్రవేశం



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో పార్లపల్లెలోని శ్రీ పాండురంగస్వామి దేవాలయంలో సోమవారం అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. తొలుత పాండు రంగస్వామి పటాలకు ప్రత్యేక పూజలు, హోమం చేశారు. 200 మంది పైగా భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.